తప్పెవరిది?

వార్తకవి కృష్ణమూర్తి

వడ్లమిషన్ చక్ చక్‌మంటూ పని చేస్తూంది. దానికంటే చురుగ్గా పని చేస్తూంటాడు వీరయ్య. దం, దం అంటూ మిషన్ వడ్లను త్వరత్వరగా దంచేస్తూంటే, క్రింద పడే తవుడు చప్పచప్పన తోడేస్తూంటాడు వీరయ్య. వాడి దేహమంతా రోజూ తవుడుమయమే. రోజున కెంత తవుడు ముక్కులగుండా దూరి వాని ఊపిరితిత్తుల కెడుతూందో, కొలచి చూచినవారు లేరు. ఎంత తవుడు చెవుల దూరి లోపల పెంట కుప్పగ ప్రోగవుతూందో గమనించినవారు లేరు. ఎంతతవుడు నోటిగుండా వెళ్లి కడుపులో చేరుతూందో లెక్కించినవారు లేరు. ఎంత తవుడు కన్నుల జేరి దృష్టిని తగ్గిస్తూందో తెలిసికొనగోరినవారు లేరు. వీటితో తన జీవితకాలము సగానికి సగం తగ్గిపోవుచున్న దని వీరయ్యకుమాత్రమే తెలియును. తెలిసి మాత్ర మేమి చేయగలడు? వాని బ్రతుకు తెరు వది. వాని యారోగ్యవిషయమై మిల్లు యజమాని కేమి గావలయును? తన మిల్లు చక్కగా పనిజేస్తూ లాభం సంపాదించడమే అతనికి కావలసినది. తన పని నిమిత్తమై కూలీల ప్రాణాలైనా లాగ సంసిద్ధుడే.

అసలు ఆ మిల్లు యజమానిని చూస్తే చాలు, కూలీ లందరు హడలిపోతూంటారు. అతని కాళ్లచప్పుడు వింటే చాలు, గడగడ మంటూ అదరిపడుతూంటారు. యజమాని తాను చేతిలో కర్ర పూని, టక్‌టక్‌మంటూ వస్తూంటే వారిపాలిటి యముడని తోపజేసే వాడు. వాడికన్నా వానికఱ్ఱ కెక్కువ ఘనత. కూలీల బుర్రలపై నాట్యం చేస్తూ విఱ్ఱవీగుతూంటుంది. దాని చివర గల మేకు మావటి వాని అంకుశపు మొనలాంటిది. ఏనుగును పొడిచేలాగు, అది కూలీల దేహాల గ్రుచ్చి గాయపఱచి రక్త మెంతో త్రాగుతూండేది.

పాప మా కూలీలకర్మం అలాగుంది. వారిజీవనపథ మది. ఆ అంకుశముపోటుతో వా రొక్కొక్కప్పుడు ఆ పని మానివేసి అడుక్కొని బ్రతుకుదా మనుకొంటారు. కానీ, అడుక్కొని బ్రతకడం అంతకన్నా దుర్భర మని వారికిగూడా తెలియును. 'దేహీ' యని తిరిగే వారి కన్నుల జూస్తే వా రెన్ని వక్కప్రొద్దులు జేశారో బోధపడుతుంది. "అమ్మా! కబళ" మంటూ ఒకయింటి నుండి మరో ఇంటికి పరుగిడేవారి కడుపులు గంటే చాలు. వా రెన్ని ఏకాదశులు చేశారో తెలుస్తుంది. "అన్నమో రామచంద్రా" యను ఆర్తధ్వనులు వింటే చాలు; ఎంతమంది ఆకలి కేకలతో అరచి ఆర్భటించి ఆయువు గోల్పోవుచున్నారో బోధపడుతుంది. ఇలాంటి పరిస్థితులలో, యజమాని అంకుశముపోట్లకు సహిస్తూ తమదే భాగ్య మనుకుంటారు, పాప మా నిర్భాగ్యులు. ఇంతకూ తమ కిచ్చే కూలి రోజుకి పావలా. తాను తన కుటుంబమూ ఆ పావలా తిండిపై ఆధారపడాలి. ఆ తిండి

చాలక, లోని కంటుకపోయిన కడుపులతో, ఎముకలు తెక్కపెట్టగలిగిన తనువులతో, 'ఆకలో ఆక' లంటూ అల్లాడుతూన్న బిడ్డలతో, కాలక్షేపము చేస్తూంటా రా కూలీలు. ఆ పావలా తిండైనా చాలు కుటుంబానికి వినియోగిస్తే. కాని ఆపావలాతో తప్ప త్రాగి, తైతక్కలాడుతూ సంసారాన్ని అల్లకల్లోలము చేయుట కద్దు. వారిని చూస్తే లోకుల కెగతాళి — ధనికుల కసహ్యము — విద్యావంతుల కేవగింత. పైగా వారి కందులకు శిక్ష. ఎంత అన్యాయం? వారి కష్టానికి తగిన కూలియ్యమని మిల్లు యజమాని నెందులకు శిక్షించరాదు? ఇలాగ జరిగేవెన్నో? ఈ విషమసమస్యల చిక్కు విడదీయ బూనుకొను పుణ్యాత్ము లెవరు?

మొత్తానికి వీరయ్య అదృష్టవంతుడే. తన చురుకుదనము, పనిపైగల శ్రద్ధ, ఓర్పు, పట్టుదల, అభిమానము, మిల్లు యజమాని నెంతో మెప్పించాయి. యజమానికి వీరయ్యంటే ఎంతో ప్రేమ. కాని తన ప్రేమను వానికిచ్చే జీతముపై జూపినవాడు గాదు. పనిచేయకుండా సోమరులై మాట్లాడేకూలీల నప్పుడప్పుడు చెవిపట్టుకొని ఈడ్చుకొసవచ్చి చెమటలు పోస్తూ తదేకదృష్టితో తవుడును గబగబ తోడేస్తున్న వీరయ్యకు చూపెట్టి, "ఇదిగో వీరయ్యా! వీనికి కాస్త బుద్ధి చెప్పు" అనేవాడు. వీరయ్య ఉబ్బిపోతూ, "దండం బాబూ! మన్నించం" డంటూ సంతోషంతో మరిం తెక్కువగా కష్టపడి పనిచేసేవాడు. కాలు నొచ్చినా, కడుపు నొచ్చినా పని కెన్నడును ప్రాలుమాలినవాడు కాడు.

కొన్నిరోజులు గడిచాయి. ఒకరోజు వీరయ్య తలనొప్పి జ్వరంతో బాధపడుతున్నాడు. "ఈవేళ పోవద్దు మామా" అని ఎంత బ్రతిమాలినా పెళ్లాంమాట వినకుండా, ఎప్పటివలె పనికెళ్లాడు సద్దిబువ్వకూడా తినకుండా. పాపం! ముక్కుతూ మూల్గుతూ శక్తి లేకున్నా, బలవంతాన తవుడు తోడేస్తున్నాడు. కాని బాధ ఎక్కువయింది. ఇంక పని చేయలేకపోయాడు. ఇంతలో యజమాని అక్కడకు రాగా, "బాబయ్యా! ఈవేళ మన్నించండి. తలనొప్పి, జ్వరంతో బాధపడుతున్నా. ఏలినవా రీవేళ సెలవియ్యా" లన్నాడు. యజమానికి వానిపై జాలి పుట్టింది. కాని వాని ప్రాణానికన్న తన మిల్లు పనే ముఖ్యమనుకొన్నాడు. వీరయ్య లేకపోతే, అపని ఒక్క నిమిషమైనా జరుగదని అతనికి తెలుసు. "వీరయ్యా: ఈవేళ కాస్త పని చేయి. రేపు సెలవిస్తా" నన్నాడు యజమాని. వీరయ్య గుండెలు నీరయ్యాయి. తా నెంత కష్టపడి పనిచేసినా ఆమాత్రమైనా తనపై కరుణించనందుకు యజమానిపై విసుగుకొన్నాడు. వీరయ్య ఆ మిల్లు ఒక నరకంగా తోచింది. ఆయంత్రము ఒకమారణయంత్ర మనుకొన్నాడు. ఆ యజమాని ఒక దండధరుడులాగ అగపడ్డాడు. కాని తా నేమి చేయగలడు? బదులు మాట్లాడినచో గోరుచుట్టుపై రోకటిపో టన్నట్టు తన రోగస్థితిలో పని మాన్పించునేమో యను భీతి. చేయునది లేక ఒకమాటు యజమానివంక దీనదృష్టుల బఱపాడు. యజమాని వాటిని గమనించకుండా వెళ్లిపోయాడు. వెంటనే తల దించుకొని, వీరయ్య పనిజేయడాని కుద్యమించాడు. ఎంత ప్రయత్నించినా, చేతులకు చురుకుదనము కలిగింది గాదు. 'ఉస్సు' మంటూ పైకి లేచి, గిఱ్ఱుమంటూ తిరుగు

తూన్న యంత్ర చక్రాన్ని చూశాడు. మిల్లంతయు గిర్రుమని తిరిగినట్టయింది. తాను కూడా గిర్రుమని తిరిగినట్లు తోచింది. వెంటనే మనస్సు గిర్రుమని తిరిగింది. ఇంక ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు. మాట్లాడకుండా మరలి పోయాడు పెళ్లాము. గౌరమ్మ ఆతురతతో వచ్చి, విసరుతూ కూర్చుంది. కాస్సేపు తర్వాత, "మామా, కాస్త అంబలి తాగుతావా" అంది. వద్దంటూ వీరయ్య తల ఊపేడు. మాట్లాడడానికి అతని నోట తడి లేదు. నీళ్లు కావాలని సైగచేశాడు. గౌరమ్మ నీళ్లు తెచ్చిఇవ్వగా, త్రాగి కొంచెం తెప్పరిల్లి నెమ్మదిగా ఉందంటూ నిదురించాడు. ఆ తర్వాత గౌరమ్మ చంటి పిల్ల లిద్దరికి అన్నం పెట్టి, నిదురింపజేసి, తాను భర్తప్రక్కన గూర్చొని, కను మూయకుండా మొగుడి కుపచారం చేసింది.

ఒక నెలరోజులవరకు వీరయ్య జ్వరంతో బాధపడ్డాడు. ఆతర్వాత క్రమేణ నయమయ్యింది. చాలా సన్నగిలిపోయాడు. కళ్లు గుంతలు పడ్డాయి. ఎముకలు వేరేసినట్లు కనుపిస్తున్నాయి. తన జీతంలో అప్పుడప్పుడు మిగిలించిన డబ్బుతో ఖాయిలా దినము లెట్లో గడపగలిగాడు. అప్పటికప్పుడే రెండు నెలలు గతించాయి. ఇకనైనా పనిలో ప్రవేశిద్దామని మిల్లు యజమానివద్ద కెళ్లి, దణ్ణంపెట్టి "బాబయ్యా! ఖాయిలా బాగయింది. ఏలినవారు పనిప్పించారంటే జాగ్రత్తగా పనిజేసికొంటా" నన్నాడు. కోపం గనబరస్తూ, యజమాని "వెళ్లవోయి. నిన్నెప్పుడో పనినుండి తొలగించాను. ఆవేళ పనిజేసేటట్టు నటించి, చెప్పకుండా ఉడాయించావు గావు? ఇప్పుడు నీకు పని కావాలి? సిగ్గు లేదూ? వెళ్లు వెళ్లు" అని గద్దించాడు. వీరయ్య తన కథ అంతా చెప్పుకొని 'మన్నించా' లంటూ బతిమాలాడు. "బాబయ్యా! బీదవాణ్ణి మీబిడ్డను. మన్నించండి బాబూ! మన్నించండి. దిక్కులే" దంటూ అతనిపాదాలు పట్టుకొన్నాడు. యజమాని కాళ్లు విదలిస్తూ "వెడతావా, లేక జవానుతో గెంటించనా" అంటూ కసరేశాడు. లాభం లేదని గ్రహించి, కడసారి దణ్ణంపెట్టి, కన్నీళ్లు గారుస్తూ వీరయ్య ఇంటికి మరలి పోయాడు.

జరిగిన కథను వీరయ్య గౌరమ్మకు వినిపించాడు. గౌరమ్మ ఎంతో మెత్తని మనస్సు గలది. మొగుడంటే ఎంతో భ్రమ. కలిగిన దుస్థితికి వగచి "పోనీ లే మామా! ఆవూసు మానేద్దాం. మనకూ మిల్లుకూ ఋణాను బంధం లేదు. దానిగ్గా మనస్సు నొచ్చుకో వద్దు. మన మిద్దరము కలసి కూలినాలి చేసికొని బతుకుదాం. అంతవరకూ మానాన్నిచ్చిన ఈ రెండు ఎండికడియాలమ్మి తిందాం" అంది ఆ ఇల్లాలి చల్లనిమాటలతని దుఃఖాన్ని బాపి మనసులోనియాందోళన ముడిపి ఎంతో ఆనందం కలిగించాయి.

రెండురోజులు గడిచాయి. అకస్మాత్తుగా ఒకరోజు బట్టలుతుకబోయి, కాలుజారి నూతిలో బడి అసువుల బాసింది గౌరమ్మ. వీరయ్య దుఃఖానికి మేర లేదు. కష్టాలకు మితి లేదు. తల్లిని బాసిన పిల్లలిద్దరిని పెంచే భారం వీరయ్య మీద పడింది. కష్టాలపై కష్టాలు వచ్చిపడ్డాయి. తగిలిన కాలికే తగలడం సహజం. పిల్లలు "అమ్మా, అమ్మా" అంటూ ఏడుస్తున్నారు. పాపము వీరయ్య తనస్థితికి చాలా చింతించాడు. చేయునది లేక ఎట్టకే

లకు ధైర్యము తెచ్చుకొని పని సంపాదించుకొనడానికి బయలుదేరి పొయ్యాడు. ఎందరినో ఆశ్రయించాడు. తమ కవసరము లేనిదే ఎవరుమాత్ర మతనికి పనివ్వగలరు? ఎక్కడగాని పని దొరికింది గాదు. ఇద్దరు బిడ్డలూ తాను తిండి లేక ఎలాగో ఒక దినము గడిపారు. రెండోరోజు పిల్లలగోడు చూడలేకపోయాడు. బిడ్డల బుజ్జగించి, నీళ్లు ద్రాపి అడుక్కునైనా తిందా మని బిడ్డలతో బయలుదేరాడు.

మధ్యాహ్నం పండ్రెండుగంటలయింది. పాపం ఎండలో నడువలేక బిడ్డలు "అమ్మా అమ్మా" అంటూ ఆకలితో ఏడుస్తున్నారు. వాళ్ల నిరుచంకల మోసికొని ఒక ఇంటి ముందట నిలబడ్డాడు. అంతవరకు అడుక్కుతినడం అలవాటు లేనందున ముం దేమనడానకు తోచింది గాదు. "తల్లీ బిచ్చ!" మంటూ అరిచాడు. ఆయింటియావిడ "ఇప్పుడే భోజనా లయినవి. ఏమీ మిగలలేదు పో" మ్మంది. తొల్తనే పరాభవ మైనందుకు చింతిల్లి రెండో ఇంటిముందట నిలబడి "తలిదండ్రులారా! ఈ బీదవాణ్ణి కరుణించండి" అన్నాడు. ఎవరూ పల్కనందున రెండో మాటు మరింత బిగ్గరగా అడిగాడు. కఱ్ఱతోటి ఒక జవాను బయటికి వచ్చి "బుద్ధిలేని మనిషి! అలా కేకలేస్తా వేమిటి? తహశీల్దారుగారు నిదురిస్తున్నారు. జాగ్రత్త! తిన్నగా వెళ్లిపో" అన్నాడు. వెంటనే మూడవ యింటికి పోయి, "బిడ్డల గన్న తల్లుల్లారా! ఈ దిక్కులేని పక్షులకు కాస్త బువ్వ వేయండి" అని అతిదీనంగా అడిగాడు. ఆ గృహిణి, "అబ్బా! మీపోరు పోరుగాదు. కాస్త కన్ను మూశానో లేదో అప్పుడే మీయవాంతరం" అంటూ కసరుతూ వచ్చి, "ఇప్పుడు భిక్ష మేమిట్రా యబ్బీ! రెండు గంటలు దాటింది వెళ్లు" మన్నది. ఇలాగే ఇంటినుండి ఇంటికి వెళ్లాడు. ప్రయోజనం లేకపోయింది. ఏమి ఖర్మమోగాని, యేయమ్మగాని పట్టుమని పిడికె డన్నం వేసిన పుణ్యాన బోలేదు. ఆకలి గొని బిలబిల తన్నుకుంటూ ఏడుస్తున్నారు బిడ్డలు. దిక్కులేని బిడ్డలకేసి చూస్తూ చేయునదిలేక, దిక్కుతోచమి, దీనంగా నిలబడ్డా డక్కడ. రెండు పుల్లాకులు కనిపించాయి. కానీ, ఒక్క మెతుకైనా లేకుండా వాటిని కుక్కలూ కాకులూ శుభ్రంగా నాకేశాయి. 'దిక్కుమాలిన దేవుడీ మాత్రమైనా పుణ్యం గట్టుకొనలేదే' యని నిందించాడు. "అమ్మా" అంటూ బిడ్డల పోరు మరింత ఎక్కువయింది. 'అమ్మ' మాట పదేపదే చెవులబడగా గౌరి స్మృతికి వచ్చింది వీరయ్యకు. అప్పటికి గౌరి గతించి ఒకపక్షమయింది. గౌరి క్రొత్తగా కాపురానికి వచ్చినపుడు దాని సిగ్గుమాటలకు మురుస్తూ, సరసంగా "ఎంత చక్కని చుక్కవే గౌరీ! నీ వెంత వలపులరాణివే నారీ!" యని తాను పాడిన పదమూ, తన ప్రేమ క్రీడావినోదాలూ జ్ఞప్తికి వచ్చినాయి. తాను రోజంతా పనిచేసి ఇంటికి వచ్చేసరికి, కాళ్లకు నీళ్లిచ్చి, కంచం ముందగెట్టి, ఉడుకుడు కన్నం వడ్డించి తాను తింటూంటే, ఎదుట నిలబడి, "నిదానంగా మరోకడి మింగు మామా!" అంటూండే గౌరి అతని దృష్టిపథాన ప్రత్యక్ష మయింది. తాను జ్వరంతో సెయ్య కంటినపుడు, పైటకొంగుతో విసరుతూ, నిద్రాహారాలు మాని తన్నే కనిపెట్టుకొని కూర్చున్న గౌరి ఎదుట గోచ

రించింది. తాను పనిపోయినపుడు, ఇంటికి మరలిరాగా, "పోనీలే మామా! ఆ వూసు మానేద్దాం. మా నాన్నిచ్చిన వెండి కడియాలమ్మి తిందా" మన్న వాక్కులు అతని తలపునకు వచ్చాయి. వీరయ్య నిశ్చేష్టుడై కొంతసేపట్టే నిలబడ్డాడు. గోడు గోడున కుందుచుండు బిడ్డలవంక ఒకసారి చూశాడు. కన్నీరు గార్చాడు. వెంటనే తనకష్టాలకు కారణభూతుడైన మిల్లుయజమాని తలపునకు వచ్చాడు. అతనిని మెప్పించదలచి తా నెంతకష్టపడ్డదీ, దాని పరిణామమూ యోజించాడు. మన్నించమంటూ తాను కాళ్లపై బడినందుకు పరిహారంగా "వెడతావా? జవానుచేత గెంటించనా?" యన్నమాటలు చెవులలో బిగ్గరగా వినబడినట్లయ్యాయి. వెంటనే అతనిహృదయం ఘనీభవించింది. నేత్రములు కోపారుణితములై నిప్పులు గ్రక్కుతున్నాయి. మనస్సు మారింది. మానవత్వం పోయి రాక్షసత్వం అతని నావహించింది. ఉబికుబికి వచ్చెడి ఆగ్రహాన్ని నిగ్రహించుకోలేకపోయాడు. ఎదుట ప్రపంచాన్ని మరచిపోయాడు. బిడ్డల అరపు లేమాత్రం అతని చెవినిబడడం లేదు. అతని కన్నుల ఎదుట గోచరించింది ఒకటే-యజమాని ఒకడే. పళ్లు బిగించి లేచి, తెరచుకొన్న కన్నులతో, తదితరములు చూడక, చక్కగా బయలుదేరిపోయి మిల్లుయజమాని ఆఫీసు గది చేరాడు. కుర్చీలో కూర్చొని లెక్కలు వ్రాస్తున్న యజమాని వీరయ్యని చూసి వెఱ్ఱికేక వేశాడు. బల్లపై గల కత్తితో వీరయ్య యజమాని నొక్కపోటు పొడిచాడు. అంతటితో యజమాని గాఢనిద్ర చెందాడు. ఎఱ్ఱని రక్తం చివ్వుమని పైకి చిమ్మింది యజమాని కాయంనుంచి. ఆ ఎరుపు చూచి వీరయ్యకోపం చల్లారింది. మనుష్య ప్రకృతి మరల వీరయ్యని ఆవేశించింది. తాను చేసిన పని అప్పు డాతనికి స్పష్టమయింది. కాని ప్రయోజన మేమి? తాను చేసిన నేరమున కెవరు బాధ్యులు?

తప్పెవరిదో? ఏమైతే నేం, వీరయ్యకథ గూడా అంతటితో సమాప్తి జెందింది.